సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మహిళ శ్రమను గుర్తించని వ్యవస్థ : మల్లు లక్ష్మి

- గౌరవప్రదమైన జీవితం కోసం నిరంతర పోరాటం : జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల శ్రమను గుర్తించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మి మాట్లాడారు. కార్మిక వ్యతిరేక, మహిళా వ్యతిరేక ప్రభుత్వాలు విధానాలతో తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రయివేటీకరణ పెరుగుతోందని, కనీస వేతనం అమలు కావడం లేదని తెలిపారు. మహిళల శ్రమను గుర్తించని ఈ వ్యవస్థను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య హక్కు, విద్య హక్కు, భద్రత కోసం పోరాడుతూనే ఉండాలని చెప్పారు. జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం కార్మికుల సమస్య కాదు.. ప్రజా జీవనానికి సంబంధించిన సమ్మె. అందువల్ల అందరూ ఒక్కతాటిపైకి రావాలి అని సూచించారు.

పెరుగుతున్న అఘాయిత్యాలు

దేశవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఓ వైపు ఉద్యోగాలు తగ్గుతుంటే.. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం పెరుగుతున్నాయన్నారు. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణ, గౌరవవంతమైన జీవితం కోసం ఐద్వా నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. సార్వత్రిక సమ్మెలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. గ్రామ స్థాయిలో సమ్మె సన్నాహక ప్రచారం చేయాలని, ప్రతి మహిళా సంఘం చైతన్య వేదికలుగా మారాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య రంగం, ఆశా వర్కర్ల సమస్యలు, విద్యారంగంలో మహిళల సవాళ్లు వంటి అనేక అంశాలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు సాయిలీల, కోశాధికారి కవిత, సహాయ కార్యదర్శి ఉమా, ఉపాధ్యక్షులు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న శైలజ

శాశ్వత అభివృద్ధి దిశగా 'మేడారం'

- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్ నివేదిక ఇవ్వాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండేళ్లకోసారి నిర్వహించే మేడారం మహా జాతర సందర్భంగా చేపడుతున్న పనులు శ్వాశతంగా నిలిచేలా నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రతి జాతరకు వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నట్టు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఐటిడిఎ గెస్ట్‌హౌస్‌లోని హాల్‌లో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, అడ్వైజర్ గోవిందహరితో కలిసి సమ్మక్క, సారలమ్మ మహా జాతర-2026పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడారం నాలుగు రోజుల జాతరకు హాజరయ్యే సుమారు కోటిన్నర యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని సూచించారు. స్టూడియో వన్ ఆర్కిటెక్టర్ రూపొందించిన మాస్టర్ ప్లాన్ నివేదికను కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పక్క ప్రణాళికతో రూపొందించాలని అన్నారు. అనంతరం మేడారంలోని వనదేవతలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ పూజారులు డోలు వాయిద్యాలతో వారికి స్వాగతం పలికి గద్దెలపైకి తీసుకెళ్లి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జె సురేష్‌బాబు, ఎంపిడిఒ సుమనవాణి, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్, జి సంపత్‌రావు, ఆర్‌డిఒ వెంకటేశ్, ఎపిఒ వసంతరావు, ఇఒ మేకల వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, పూజారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిపిఒలకు త్వరలోనే నియామక పత్రాలు

- రెవెన్యూ జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో త్వరలోనే గ్రామ పరిపాలన అధికారుల(జీపీఓ)కు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జెఎసి చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే అంశంపై గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీ, సిసిఎల్ఎ లోకేష్ కుమార్ రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ఇప్పటికే జిపిఒ నియామకం కోసం పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందికి మొదటి విడతలో ఈ అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి లోకేష్ కుమార్ దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాల్లో ఆదే సంఖ్యలో జీపీఓలను నియమించాల్సి ఉందని తెలిపారు. కానీ ప్రస్తుతం 3,454 మంది మాత్రమే ఎంపికయ్యారని గుర్తు చేశారు. ఆసక్తి కలిగిన పూర్వ విఆర్ఎ, విఆర్‌ఒలకు మరో సారి జిపిఒ అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 61 ఏళ్లు దాటిన విఆర్ఎల వారసులకు సైతం జిపిఒలుగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి భిక్షం, మల్లేష్ , రాంబాబు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు

- నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి
- కేంద్రం కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను వీడాలి
- రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయని బిజెపి
- సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం కదం తొక్కాలి
- తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక సదస్సులో తమ్మినేని వీరభద్రం

సదస్సులో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ప్రజాపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం చెప్పారు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లువెంకట నరసింహారెడ్డి భవన్‌లో గురువారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని ప్రసంగిస్తూ.. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. వాటిని అమలు చేసి కార్మికవర్గం హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 -26 బడ్జెట్‌లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగానే కేటాయింపులు చేసిందని వివరించారు.

మద్దతు ధరల చట్టం చేయాలి

భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మికవర్గం ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని తమ్మినేని పిలుపునిచ్చారు. రైతు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఢిల్లీలో రైతులు పోరాటం చేసిన సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా నిర్వీర్యం చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర శాసన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న ఏడాదికి రూ.12,000 ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టపరిచి 16 రకాల నిత్యావసర వస్తువులను పేదలందరికీ అందించాలని కోరారు.

ఉద్యోగాలపై మోడీ శ్వేత పత్రం విడుదల చేయాలి

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి ఈ 11 సంవత్సరాల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారతదేశంపై ఆంక్షలు విధిస్తుంటే ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహిస్తున్నారని విమర్శించారు. ట్రంప్ చర్యల మూలంగా దేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు, నాయకులు కోలిశెట్టి యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చెప్పిన మేరకే నడుచుకున్నాం

- ఈ ఫార్ములా కారు రేసు కేసులో ఐఎఎస్ అర్వింద్‌కుమార్ వాంగ్మూలం

హైదరాబాద్ బ్యూరో : ఫార్ములా ఈ కారు రేసు కేసులో హెచ్ఎండిఎ మాజీ కమిషనర్ అర్వింద్‌కుమార్‌ను గురువారం ఎసిబి అధికారులు సుధీర్ఘంగా ఎనిమిది గంటల పాటు విచారించారు. ఆయన్ను విచారించడం ఇది మూడోసారి. ఫార్ములా ఈ కారు రేసు కేసులో తాను అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకే నడుచుకున్నానని ఎసిబి అధికారులకు మరోమారు తెలిపారు. ఫార్ములా ఈ ఆఫీస్‌కు హెచ్ఎండిఎ నుంచి నిధుల బదలాయింపు విషయంలో తమ వ్యక్తిగత నిర్ణయమంటూ ఏదీ లేదని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. రూ.50 కోట్లకుపైగా ఒక విదేశీ కంపెనీకి నిధుల బదలాయింపు జరిగే సమయంలో ఆర్‌బిఐ నుంచి అనుమతి తీసుకోవాలి కదా? అని ఎసిబి అధికారులు నిలదీయగా... ఆ వ్యవహారం అంతా అప్పటి అధికారులు చూసుకున్నారని దాటవేసినట్టు తెలిసింది. ఎసిబి అధికారులు వేసిన పలు ప్రశ్నలకు గతంలో కెటిఆర్ ఇచ్చిన స్టేట్ మెంట్‌ను సపోర్టు చేస్తూ ఆయన మాట్లాడినట్టు విశ్వసనీయ సమాచారం. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామంటూ ఆయన్ను ఏసీబీ అధికారులు పంపారు.

సైబర్ నేరాల నిర్వహణపై కాలేజీల్లో త్వరలో అవగాహన

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయెల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైబర్ నేరాలను అరికట్టడంలో భాగంగా త్వరలో అన్ని కళాశాలల్లోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయెల్ తెలిపారు. సైబర్ నేరాలపై రాష్ట్ర వ్యాప్తంగా గురువారం 543 అవగాహన సమావేశాలు నిర్వహించినట్టు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే కాకుండా ఆన్‌లైన్ మోసాల గురించి కూడా విడమర్చి చెప్పనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అడ్డుపెట్టుకొని సైబర్ నేరస్తులు కోట్లాది రూపాయల మోసాలకు పాల్పడుతున్న వైనాన్ని అవగాహన కార్యక్రమాల్లో వివరించినట్టు పేర్కొన్నారు. సైబర్ నేరాల తీరుతెన్నుల్లో వస్తున్న మార్పుల గురించి సమాజంలో అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

రాజ్యాంగం రద్దుకు ఆర్‌ఎస్ఎస్, బిజెపి కుట్రలు

- బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై పెరిగిన దాడులు
- 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు : టి స్కైలాబ్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్, బిజెపిలు కుట్రలు చేస్తున్నాయని, బిజెపి విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా ఏటూర్‌నాగారం మండల కేంద్రంలో కెవిపిఎస్ నాయకులు అంబాల మురళి అధ్యక్షతన నిర్వహించిన ములుగు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఇద్దరు దళిత యువకులు ఆవు దూడలను తీసుకెళ్తుండగా గోరక్షక దళాల ముసుగులో ఆర్ఎస్ఎస్ మతోన్మాద గుండాలు వారిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆ ఇద్దరు దళితులకు అరగుండు కొట్టించి బలవంతంగా మురుగునీటిలో ముంచి మోకాళ్లపై ఊరిలో నడిపించి గడ్డి తినిపించడం వంటి చిత్రహింసల పాలు చేసినట్టు చెప్పారు. గోరక్షక దళాలు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నాయని అన్నారు. గోరక్షక దళాలను తక్షణమే నిషేధించి, ఆ దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోరక్షక దళాలు ఆర్ఎస్ఎస్ ప్రోత్బలంతోనే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 19 వేల మంది దళిత విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.154 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతాంగ పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని. వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ, సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, జిల్లా అధ్యక్షులు ఎండి దావుద్, కెవిపిఎస్ జిల్లా నాయకులు రత్నం ప్రవీణ్, గుగ్గిళ్ల దేవయ్య, వ్యాసం రమేష్, దేవేందర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించేందుకు వీలుగా పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులకు క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. జులై 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించింది. క్రీడాకారులు నామినేషన్లు దాఖలు చేయడానికీ, మరిన్ని వివరాలకు, మార్గదర్శకాల కోసం https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. ఆన్‌లైన్ ద్వారా స్వీకరించబడిన నామినేషన్లు / సిఫార్సులు మాత్రమే పరిగణించబడతాయని పేర్కొంది.

మివి నుంచి ఎఐ బడ్స్

హైదరాబాద్ : దేశీయా ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మివి కొత్తగా ఎఐ బడ్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. వీటిని పూర్తిగా భారత్‌లో డిజైన్, అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ఇవి తెలుగు సహా ఎనిమిది భాషల్లో ఎటువంటి సెట్టింగ్‌లను మార్చకుండా అర్థం చేసుకుంటుందని మివి సహ వ్యవస్థాపకులు మిధుల దేవభక్తుని పేర్కొన్నారు. ఒక్క సారి చార్జింగ్ చేస్తే 40 గంటల పాటు పని చేసే ఈ బడ్స్ ధరను రూ.6,999గా నిర్ణయించామన్నారు.

హెచ్ఎంఎ నూతన అధ్యక్షుడిగా అల్వాల దేవేందర్ రెడ్డి

హైదరాబాద్ :హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఎ) నూతన అధ్యక్షుడిగా ఈరైడ్ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ వ్యవస్థాపకుడు అల్వాల దేవేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి హెచ్ఎంఎ తన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఉపాధ్యక్షుడిగా శరత్ చంద్ర మారోజు, కార్యదర్శిగా వాసుదేవన్‌ను ఎన్నికయ్యారు. ఈ కొత్త కమిటీలో వాసుదేవన్, చేతనా జైన్, వి శ్రీనివాసరావు, అంకర వెంకట కృష్ణ ప్రసాద్ ఉన్నారు. "వివిధ పరిశ్రమలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తాము. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందిస్తాం. వాళ్లను ఔత్సాహికవేత్తలుగా లేదా కార్పొరేట్ ఉద్యోగాలకు సరిపోయేలా తీర్చిదిద్దుతాం" అని దేవేందర్ తెలిపారు.

ఉత్తర ప్రదేశ్ విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ అడ్డుకుంటాం

- 9న సమ్మెలో విద్యుత్ ఉద్యోగులు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జెఎసిలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకుంటామని నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ సుదీప్ దత్త హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ జెఎసిల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల కన్వెన్షన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సుదీప్‌దత్తా మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఒఇఇఇ) ఆధ్వర్యంలో ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. యుపి డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను ప్రయివేటీకరిస్తే దేశవ్యాప్తంగా సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై ఈ ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ఒత్తిడి తెస్తుందని చెప్పారు. తెలంగాణ విద్యుత్ రంగం కూడా సంక్షోభంలో ఉందని, మార్కెట్ నుండి అధిక రేటుకు అధిక మొత్తంలో విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయలేదని వివరించారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ మోహన్ శర్మ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న విద్యుత్ వ్యవస్థ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఐపిఎఫ్) పాట్రన్ అశోక్ రావు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రయివేటీ కరిస్తే ధరలు సగటు మనిషికి అందుబాటులో ఉండబోదని హెచ్చరించారు. అది అత్యంత ఖరీదైన వస్తువుగా మారుతుందని, రైతులకు, సామాన్య పౌరులకు భారమవుతుందని తెలిపారు. అందువల్ల ఎలాగైనా విద్యుత్ ప్రయివేటీకరణను అడ్డుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో- చైర్మన్ శ్రీధర్, కో-కన్వీనర్ బీసీ రెడ్డి, అనిల్ కుమార్, చైర్మెన్ రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ జెఎసి చైర్మెన్ కృష్ణయ్య, ఇంజనీర్ల సంఘం జనరల్ సెక్రటరీ కే నాగప్రసాద్, కన్వీనర్ రాఘవరెడ్డి, ప్రతాపరెడ్డి, కో చైర్మన్ శేషారెడ్డి, యుఇఇయు నేతలు కె ఈశ్వర్‌రావు, గోవర్ధన్, ఆంధ్రప్రదేశ్ యుఇఇయు నాయకులు సూరిబాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసు
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు, తెనాలి
ఓ.యస్. 453/2020

బిట్వీన్ :
షేక్ అమానుల్లా (డైడ్) మరియు ఇతరులు ..... వాదులు
ఎదిరి
షేక్ మాబు సుభాని మరియు ఇతరులు .... ప్రతివాదులు

17వ ప్రతివాది : షేక్ ఖాషు, తండ్రి : లేటు మహ్మద్ హనీఫ్, ప్రైవేట్ ఉద్యోగి, ఆర్/ఓ మలక్‌పేట, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలో 17వ ప్రతివాది అయిన మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు నుండి మీకు ఎన్ని పర్యాయములు దావా నోటీసులు పంపించినను మీరు తెలిసి కూడా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావా సంతకాలు మీకు తెలియ పరచుటకు గాను పై కోర్టువారు ది. 21-7-2025న ఉదయం 10-30 గం.లకు మీరుగానీ, మీ తరపున న్యాయవాది గారు గానీ హాజరు కాబడి మీ ఆక్షేపణలు తెలియపరచు కోగలరు. లేని యెడల మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించెదరు
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదాతేది : 21-7-2025
తెనాలి.
తేది: 2-7-2025

ఇట్లు
శ్రీ వెల్లంకి విశ్వేశ్వర శాస్త్రి,
వాదుల తరపున న్యాయవాది
తెనాలి, గుంటూరుజిల్లా.
సెల్ : 7799300284

మహారాజశ్రీ DEPUTY REGISTRAR OF CHITS ONGOLE
A.R.C. NO 10/2025

CCKR. Chits &Finance (P) LTD Ongole
(వాది తరపున Asst Manager,
Y Ramana Reddy) ..... వాది.
వర్సెస్
Chintalapudi Ravi Kumar & 3 Others .... ప్రతివాదులు

దావా సమన్లు

To
Opp: 1
Chintalapudi Ravi Kumar
S/o Daivadeenam, Yadaripalli (Po & V)
Parchur (MD) Bapatla District
Opp : 4
Birudu Vijaya Raju
S/O Nagaiah,
RTC Constable,
I.D.NO.218144,T.S.R.T.C,
UPPAL Depot, Garage, UPPAL,
Medchal District Telangana state .

పై నంబరు దావా యందు నీకు CHIT REGISTRAR గారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున CHIT REGISTRAR గారు మీకు పేపర్ ప్రకటన ద్వారా సమన్లు ఇవ్వమని ఆర్డర్ ఇచ్చినారు. కావున మీ యొక్క హాజరు నిమిత్తం తేది. 29-07-2025 నకు వాయిదా అయిఉన్నది కనుక ఆ రోజు ఉదయం 10:30కి మీరు స్వయంగా వచ్చి CHIT REGISTRAR గారి ఎదుట మీయొక్క ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల వ్రాతపూర్వకంగా తెలియజేయలేని యెడల మీకు పరోక్షముగా తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది
వాయిదా తేది :29-07-2025

Order by
DEPUTY REGISTRAR OF CHITS
ONGOLE

పైసలకు పరేషాన్

- ప్రాజెక్టుల ప్రాధాన్యతలు తారుమారు
- 20 ఏళ్లుగా కొనసాగుతున్న నిర్మాణాలు
- ఈ ఏడాదిలో రూ.10 వేల కోట్ల వ్యయం
- దెబ్బతింటున్న సర్కారీ లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీటి రంగంలో సర్కారీ లక్ష్యాలు ముందుకుపోవడం లేదు. ఇందుకు నిధుల కొరతనే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉమ్మడిరాష్ట్రంలో ఎదుర్కొన్న నిధుల వివక్ష నేపథ్యంలో ఏళ్ల తరబడి ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూనే ఉంది.. తీవ్ర జాప్యం జరుగుతూనే ఉంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అవసరాల మేరకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు ఖర్చుపెట్టలేదని రేవంత్ సర్కారు ఆరోపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఇబ్బందులు తప్పడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత ప్రాజెక్టులను పేర ఎ, బి కేటగిరీలుగా కాంగ్రెస్ సర్కారు విభజించింది. ఆ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. కొంత మేర కసరత్తు చేసినా, అనుకున్నంత మేర సర్కారీ ఆదాయం రాకపోవడంతో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు పక్కకుపోతున్నాయి. గత ఏడాది కాలంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ. పది వేల కోట్లు ఖర్చు చేసింది.

ప్రాధాన్యమిదిగో..

బిఆర్ఎస్ కాలంలో ప్రాజెక్టుల నిర్మాణం ఇష్టారాజ్యంగా సాగిందనే అరోపణలు, విమర్శలు ఇప్పటికే ఉన్న విషయం విదితమే. ఈ తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో అత్యధికంగా పనులు పూర్తయిన వాటికి నిధుల కేటాయించాలని నిర్ణయించింది. దాదాపు ఆరు లక్షల ఎకరాలను అదనంగా ఆయకట్టులోకి తీసుకురావాలని అనుకుంది. అయితే నిధుల్లేక అవస్థలుపడుతుంది. 75 శాతం పనులు పూర్తయి ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన ప్రాజెక్టులకు మళ్లీ నిధులు ఇవ్వడం ద్వారా ఊపిరిపోయాలని భావించింది. కల్వకుర్తి ఎత్తిపోతలతో 1.44 లక్షల ఎకరాల భూమిని ఖాస్తులోకి తేవాలని భావించింది. బడ్జెట్‌లో రూ.715 కోట్లు కేటాయించింది. కానీ, రూ. 200 కోట్లే విడుదల చేసింది. కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఆర్‌సిపి రెండోదశ, పాలెంవాగు, దేవాదుల తదితర ప్రాజెక్టుల పరిస్థితి ఇదే. శ్రీపాద ఎల్లంపల్లి కింద 1.64 లక్షల ఎకరాలను ఆయకట్టు కింద మార్చాలనేది సర్కారు లక్ష్యం. 2024-25 బడ్జెట్‌లో రూ.545 కోట్లు ఖర్చు చేసి పాతదానితోఆటు మరో 41 వేల ఎకరాలు సాగులోకి తేవాలని అనుకుంది. కానీ, రూ. 172 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగింది. దీనికి కాసుల ఎటమటమే కారణం. ఇటీవల సిఎం రేవంత్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తరచూ ఆవేదన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర అప్పులు రూ. ఎనిమిది లక్షల కోట్లకు చేరాయి. ప్రతినెలా రూ. 18,500 కోట్ల నుంచి రూ. 19, 500 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు పోను, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకే నిధులు సరిపోవడం లేదు. ప్రతినెలా సుమారు రూ. 6000 కోట్ల లోటు ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏమీ చేయలేకపోతున్నామంటూ సర్కారులో కీలకంగా ఉన్న వారే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

6 లక్షల ఎకరాలు అదనపు సాగు ?

రాష్ట్ర ప్రభుత్వం గత జూన్ నాటికి ఆరు లక్షల ఎకరాల భూమిని అదనంగా సాగులోకి తేవాలని భావించింది. ఇందుకు సుమారు రూ. ఏడు వేల కోట్లు అవసరమని సాగునీటి శాఖ అంచనా వేసింది. ప్రాజెక్టుల ప్రాధాన్యత బాగానే ఉన్నా, నిధులు వ్యయంలో వెనకడుగు వేస్తోంది. ఆర్థికశా ఉత్తచేతులు చూపిస్తున్నది. 20 ఏండ్ల క్రితం చేపట్టిన ప్రాజెక్టులను ఈ వానాకాలం నాటికి పూర్తి చేయాలని సంకల్పించినా కేటాయింపులు ఆదిశగా లేవు. మూడేళ్లల్లో పూర్తిచేయగలిగే ప్రాజెక్టుల గురించి ఆలోచనే ప్రస్తుతానికి లేదు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కాళేశ్వరంలోని కొన్ని ప్యాకేజీలు, పాలమూరు-రంగారెడ్డిఎత్తిపోతల, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేటాయింపుల కంటే ఎక్కువ ఖర్చు చేసింది. కాళేశ్వరానికి రూ. 1650 కోట్లకుగాను రూ 611 కోట్లు వెచ్చింది.

నాలుగింటికి రూ. 27 వేల కోట్లు

50 నుంచి 75 శాతం వరకు పనులు పూర్తయిన ప్రాజెక్టులు నాలుగు ఉన్నాయి. అవి పూర్తయ్యేందుకు రూ.27,546 కోట్లు అవసరం. ఇందులో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.22,856 కోట్లు, సీతారామ ఎత్తిపోతలకు రూ.3,638 కోట్లు కావాలి. 50 శాతంలోపు పనులు జరిగిన మూడు ప్రాజెక్టులకు రూ.6,000ల కోట్లు అవసరం కాగా, ఇందులో డిండి ఎత్తిపోతల, సీతమ్మసాగర్ ఉండటం గమనార్హం.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి
సాగునీటిరంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర నిర్మాణాలు ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలి. కోటి 67 లక్షల ఎకరాలకుగాను 73.6 లక్షల ఎకరాలకు మాత్రమే నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. అంటే కేవలం 44 శాతమే. 1956 నుంచి 2004 వరకు రూ. 17 వేల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణానికి ఖర్చుపెట్టారు. అలాగే 2004 నుంచి 2014 వరకు రూ. 92 వేల కోట్లు వ్యయం చేశారు. 2014 నుంచి 2024 వరకు రూ. 1.32 లక్షల కోట్లు వినియోగించారు. నిర్మాణం చేపట్టిన మధ్యతరహా, భారీ ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా పూర్తికావడం లేదు. నిధుల్లేక కాలయాపన మూలంగా నిర్మాణం ఆలస్యమవుతుంది. దీంతో అంచనా వ్యయం పెరుగుతున్నది. ప్రాధాన్యత క్రమంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి.

BEFORE THE RECOVERY TRIBUNALAT VISAKHAPATNAM
Gr. & 1st Floor. Sn Narayana Bhawan, D.No.31-31-21
Sai Baba Street Daba Gardens, Visakhapatnam-530020
MA.13/2025 IN S.A.296/2019

Between
Sri Gongada Srinivasa Rao (Died) And Others ...Applicant
And
State Bank Of India & Others ....Respondents

SUMMONS BY WAY OF PAPER PUBLICATION
Respondents 1 to 2

R1: State bank of India, Stressed Management Branch Rep. by its Authorised Officer, Door No.6-2-915, Kirathbad, Hyderabad-500001

R2: Authorized Officer, State Bank of India, SAM Branch, Secunderabad, 5th Floor, Backside Block of HMWSSB Compound, Door No.6-2-915, Kirathbad, Hyderabad-500001.

WHEREAS the Applicant has instituted an application Under Section 17(1) of the SARFAESI Act, 2002 against the above Respondents to declare that the proceedings initiated by the Respondents 1 to 2 against Respondents 5 to 7 not binding by the appellant and for other reliefs. The above mentioned respondents are therefore hereby directed to appear before this Tribunal in person or through an advocate or duly authorized agent, in support of your defense to show cause on 09-07-2025 at 10.30 AM as to why reliefs prayed for should not be granted. Take notice that in case of default the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this tribunal on this the day of 2nd July, 2025, at Visakhapatnam.

SIGNATURE OF THE OFFICER
AUTHORISED TO ISSUE SUMMONS

టికెఎం సర్వీస్ క్యాంపెయిన్

బెంగళూరు : దక్షిణ భారతదేశంలోని తమ అన్ని డీలర్‌షిప్‌లలో "టొయోటా సర్వీస్ క్యాంపెయిన్"ను ప్రారంభించినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ తెలిపింది. ఈ వర్షాకాల సీజన్‌లో వినియోగదారుల వాహనాన్ని సిద్ధం చేయడం, ఇంటీరియర్‌ను రిఫ్రెష్ చేయడం లేదా టైర్, బ్యాటరీ తనిఖీలతో సజావుగా ప్రయాణించేలా చూసుకోవడం ద్వారా రోడ్డుపై సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించటానికి తోడ్పడుతుందని పేర్కొంది. ఇందులో ఉచితంగా 20 పాయింట్ల తనిఖీ ఉంటుందని పేర్కొంది. లేబర్ చార్జీలపై 10 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి వైస్ ప్రెసిడెంట్ సిగామణి తెలిపారు.

ఖాజాగూడలో యమ్మీ బీ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ఆహారోత్పత్తుల కేఫ్‌లను నిర్వహిస్తోన్న యమ్మీ బీ హైదరాబాద్‌లోని ఖాజాగూడలో తమ సరికొత్త స్టోర్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. చక్కెర, మైదా, గ్లూటెన్, నిల్వకారకాలు లేని తీపి రుచులను అందించే తమ సంస్థ 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కొత్త అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు యమ్మీ బీ వ్యవస్థాపకుడు సందీప్ జంగాల పేర్కొన్నారు. శుద్ధమైన పదార్థాలతో తయారు చేయబడిన, ఆహ్లాదకరమైన వాతావరణంలో వడ్డించే డెజర్ట్‌లు అందరికీ ఆనందాన్ని కలిగిస్తాయన్నారు.

హెచ్‌ఎండిఎలో నిధులు ఫుల్

- డెవలప్‌మెంట్ అప్రూవల్స్ కోసం వెయిటింగ్
- ఎలివేటెడ్ కారిడార్స్, అండర్‌పాస్‌ల నిర్మాణాల్లో వేగం
- ల్యాండ్ పూలింగ్‌పై ప్రత్యేక దృష్టి.. భవిష్యత్ లే అవుట్లు
- హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సర్ఫరాజ్ అహ్మద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ)కు నిధుల కొరత లేదని, ప్రభుత్వం నుంచి డెవలప్‌మెంట్ అప్రూవల్స్ ఉంటే అభివృద్ధి పనులు చేయడానికి హెచ్‌ఎండిఎ సిద్ధంగా ఉందని హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. గురువారం హెచ్‌ఎండిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ఏడాది ఆరు నెలల అభివృద్ధి పనులపై హెచ్‌ఎండిఎ కమిషనర్ మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న డిఫెన్స్ ల్యాండ్ అర్బన్ పరిధిలోని 163 ఎకరాలను తీసుకుని ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పాదచారుల ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోకుండా స్కైవేలు ఏర్పాటు చేస్తామని అన్నారు. జెఎన్‌టియు నుంచి ప్రగతినగర్ ప్రాంతంలో, కెపిహెచ్‌బి ప్రాంతాల్లో ప్రస్తుతం రెండు స్కైవేలు నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు.

హెచ్‌ఎండిఎ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ విధానంలో లే అవుట్లు చేస్తున్నామన్నారు. వందలాది ఎకరాల్లో లే అవుట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ల్యాండ్ పూలింగ్ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రతాప్ సింగారంలో లే అవుట్ చేశామని, లేమూరులో లే అవుట్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, లేమూరులో కొన్ని లోకేషన్స్ అయినప్పటికీ ప్లాట్లు ఆక్షన్‌లో పెట్టబోతున్నామన్నారు. చెరువుల, కుంటల పరిరక్షణలో భాగంగా హెచ్‌ఎండిఎ పరిధిలో 3,532 గుర్తించినట్లు తెలిపారు. ఇందులో కొన్ని లేక్స్ వెరిఫికేషన్ కూడా పూర్తయి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. గతంలో కంటే ఈ ఏడాది ఆరునెలల్లో బిల్డింగ్ పర్మిషన్లలో పురోగతి సాధించామన్నారు. 2023లో 1,361 అప్లికేషన్లకు అప్రువల్ ఇస్తే ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.565 కోట్లు కాగా.. ఈ ఏడాది ఆరు నెలల్లో 922 అప్లికేషన్లకు అప్రువల్ ఇవ్వడంతో రూ.519 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. భవిష్యత్ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రస్తుతం డ్రాఫ్ట్ వర్క్ పూర్తి చేశామని, కాపీ కూడా అందరికీ అందుబాటులో ఉంచామన్నారు. డ్రాఫ్ట్‌పై ప్రజా అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉందని తెలిపారు. జులై 15వ తేదీ వరకు డ్రాఫ్ట్‌పై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయొచ్చని సూచించారు. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ వరకు మాస్టర్ ప్లాన్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. లేమూరు లే అవుట్‌లో ల్యాండ్ ఓనర్స్‌కి సంబంధించిన ప్లాట్స్ సర్టిఫికెట్లు ఇచ్చారు కానీ పొజిషన్ చూపించలేదని.. రిజిస్ట్రేషన్ కూడా ఇవ్వలేదని కమిషనర్‌ను ప్రశ్నించగా.. టెక్నికల్ సమస్యతో ప్లాటింగ్ నెంబర్ ఇవ్వడంలో జాప్యం జరిగిందని, త్వరలో సమస్యను పరిష్కారిస్తామని బదులిచ్చారు. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా టెండర్స్ ప్రక్రియపై ప్రశ్నించగా.. ఈ విషయం హైకోర్టులో ఉందని, త్వరలో ఆర్డర్ రానుందని, రాగానే పనులు వేగవంతం చేస్తామని కమిషనర్ చెప్పారు. ఇందుకు సంబంధించిన ల్యాండ్ సమస్యలు కూడా పరిష్కారం అవుతున్నట్టు చెప్పారు.

రద్దీ సమయాల్లో రెండింతల సరికాదు

- క్యాబ్ సేవలకు చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నర్సింహారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా క్యాబ్ సేవల సంస్థలకు రద్దీ సమయాల్లో రెండింతల చార్జీలు వసూలు చేసుకోవడానికి అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపడం మానేసి ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం నిర్ణయం పేద, మధ్య తరగతి ప్రజలపైనే భారం మోపేలా ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో మెట్రో సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరినా కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం సరిగాదన్నారు. అదే సమయంలో ప్రయివేటు సంస్థలైన ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలకు మేలు కలిగేలా చార్జీల పెంపు నిర్ణయం ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే ఆ సంస్థలు రద్దీ సమయాల్లో వినియోగదారుల నుంచి ఒకటిన్నర రెట్లు వసూలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కేంద్ర నిర్ణయం వల్ల వాహనాలు నడిపే క్యాబ్ డ్రైవర్లకుగానీ, ప్రజలకుగానీ ఎలాంటి ఉపయోగం ఉండదని తెలిపారు. ప్రజా రవాణాను అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైన విషయాన్ని ఎత్తిచూపారు. హైదరాబాద్‌లో మెట్రో, ఎంఎంటిఎస్ సేవలను విస్తరించాలని కోరారు. ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం కోసం కేంద్రం అన్ని రాష్ట్రాలతో చర్చించి నిర్దిష్ట చర్యలను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్యాబ్ సేవలపై రద్దీ సమయాల్లో రెండింతల చార్జీల వసూలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

యూరియా కొరతపై అపోహలు తగవు

- సరఫరా, నిల్వల ప్రణాళికల్లో రాష్ట్ర ప్రభుత్వానిది వైఫల్యం : ఎంపి డికె అరుణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో యూరియా కొరతపై రైతుల్లో అపోహలు కలిగించేలా కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడాన్ని బిజెపి ఎంపి డికె అరుణ తప్పుబట్టారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ చేస్తున్నవి అసత్య ప్రచారాలని కొట్టిపడేశారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేకపోయినా ఒక్క తెలంగాణలో మాత్రమే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం దారుణమని పేర్కొన్నారు. ఎరువుల నిల్వ, సరఫరా ప్రణాళికల్లో వైఫల్యం వల్లనే రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. రబీ సీజన్‌కు సంబంధించి తెలంగాణకు అవసరాని కంటే ఎక్కువే యూరియాను కేంద్రం సరఫరా చేసిందని స్పష్టం చేశారు. తెలంగాణకు 9.5 లక్షల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే 12.02 మెట్రిక్ టన్నులను పంపిందని తెలిపారు.

కూతుళ్లను ప్రభుత్వ బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రామగిరి బాలాగంగాధర్ తన ఇద్దరు కుమార్తెలను తాను బోధిస్తున్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. పెద్ద కుమార్తె వర్షిణి 9వ తరగతిలో, చిన్న కుమార్తె అఖిల 7వ తరగతిలో చేర్పించారు. అందులో భాగంగా గురువారం అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఉపాధ్యాయ బృందం తోటి ఉపాధ్యాయుడిని అభినందించారు.

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ మౌనమెందుకు?

- రిజర్వేషన్లపై మల్లికార్జున ఖర్గే స్పష్టతనివ్వాలి
- రైల్‌రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునివ్వాలి : కవిత

రైల్ రోకో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేతలు ఎందుకు నోరు విప్పడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో పోస్టర్‌ను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్, బిసి సమాజం ఉద్యమాలకు దిగివచ్చి రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసన మండలిలో రెండు బిల్లులు ప్రవేశ పెట్టి పాస్ చేసిందని తెలిపారు. ఈ బిల్లులు నెలల తరబడి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నా కాంగ్రెస్ అగ్రనేతలు వాటిపై ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్‌లో సభ్యులుగా ఉన్నా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఈ అంశంపై మాట్లాడలేదని గుర్తుచేశారు. బిసి రిజర్వేషన్ల బిల్లులు చట్టరూపం దాల్చేందుకు మద్దతునివ్వాలని కోరుతూ ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖార్గేకు లేఖ రాసినట్టు తెలిపారు. కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని ఎందుకు తీసుకెళ్లడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 8వ తేదీలోపు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

బిసి రిజర్వేషన్లపై తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని శుక్రవారం హైదరాబాద్‌కు రానున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండిపెండెంట్ కమిటీ ఆధ్వర్యంలో చేయించిన కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బిసి బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బుధవారమే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు.

ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్‌ను ఆపేస్తాం

బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం ఈ నెల 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని గుర్తు చేశారు. ఆ రోజున ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్ ను ఆపేస్తామని తేల్చిచెప్పారు. రైల్ రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునిచ్చి విజయవంతం చేయాలని కోరారు. రైల్ రోకోకు బిఆర్ఎస్ మద్దతునిస్తుందా అనే ప్రశ్నపై స్పందిస్తూ.. తాను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీని.. రైల్ రోకోకు బిఆర్ఎస్ మద్దతునిస్తుందని అన్నారు. తెలంగాణ హక్కులను కాలరాసే ఈ ప్రాజెక్టుపై ఇకనైనా సిఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుపిఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆ కమిటీలో వికలాంగులకు స్థానం లేదా?

- ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం నియమించిన భాషా సాంస్కృతిక శాఖ అడ్వైజరీ కమిటీలో ఒక్క వికలాంగునికీ స్థానం కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ప్రశ్నించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం గౌరవాధ్యక్షులు వరమ్మ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పథకాలు, సోషల్ డెవలప్‌మెంట్, సాంస్కృతిక అంశాలపై కృషి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని వికలాంగుల్లో కవులు, కళాకారులు, రచయితలు వందలాది మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరిని ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. వికలాంగుల పట్ల ప్రభుత్వమే వివక్షత చూపడం కంచే చేను మేసినట్టువుతుందని తెలిపారు. సకలంగులతో పోటీ పడుతున్న వికలాంగుల ప్రతిభను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. భాషా సాంస్కృతిక శాఖ అడ్వైజరీ కమిటీలో వికలాంగులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

143 బొగ్గు గనులను శాస్త్రీయ పద్ధతిలో పూడ్చేస్తాం

- ఆ ప్రాంతాల్లో వృక్ష సంపదను పెంచుతాం
- రామగుండంలో గ్రీన్ వాల్ ఏర్పాటుకు కన్వాతో సింగరేణి ఒప్పందం
- కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఇప్పటికే బొగ్గు వెలికితీత పూర్తి అయిన 143 గనులను శాస్త్రీయ పద్ధతిలో పూడ్చేయబోతున్నామనీ, అక్కడ వృక్ష సంపదను పెంచుతామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ శివారులోని కాన్హా శాంతివనంలో బొగ్గు గనుల శాఖ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. అందులో బొగ్గు గనుల కేంద్ర సహాయ మంత్రి సతీశ్ చంద్రదూబే, కమిటీ సభ్యులైన ఎంపిలు, గనుల శాఖ కార్యదర్శి విఎల్ కాంతారావు, కోలిండియా చైర్మన్ పిఎం ప్రసాద్, సింగరేణి సిఎండి బలరాం నాయక్, పిఎస్‌యుల సిఎండిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి, కాన్హా మధ్య .. రామగుండంలో గ్రీన్ వాల్ నిర్మాణానికి ఒప్పందం కుదిరింది. దేశంలోని వివిధ బొగ్గు గని ప్రభావిత ప్రాంతాల్లో అటవీ సంపద ఏర్పాటుకు కోలిండియాతో కన్హా ఒప్పందం కుదుర్చుకుంది. సమావేశంలో మైన్ క్లోజర్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. మైన్ క్లోజర్ సందర్భంగా.. మైనింగ్ కోసం భూములిచ్చి ఉద్యోగాలు పొందిన వారికి మళ్లీ ఉపాధి కల్పించడం, తదితర అంశాలను సభ్యులు లేవనెత్తారు. దీనిపై దృష్టిసారిస్తామని కిషన్ రెడ్డి హామీనిచ్చారు. తమ ప్రభుత్వం ఉత్పత్తిని పెంచడంతోపాటు కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న ఇన్సూరెన్స్ మొత్తానికి అదనంగా ప్రతి ఒక్కరికీ అదనంగా కోటిరూపాయల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని తెలిపారు. పూడ్చివేసిన గనులను అక్కడున్న ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించే ఆలోచన కూడా ఉందని తెలిపారు. గనులు క్లోజ్ చేసిన ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటామనీ, సమాజానికి ఉపయోగపడేలా వాటిని మార్చుతామని చెప్పారు. షాద్‌నగర్‌లోని హార్ట్ ఫుల్ సంస్థ వృక్ష సంపదను పెంచేదిశగా చేస్తున్న చర్యలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

విభజన హామీలు, బనకచర్లపై రాహుల్ మౌనం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర విభజన హామీల అమలుపై, బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల గురించి ప్రధాని మోడీని నిలదీయలేదని తెలిపారు. బిజెపితో కలిసి రాహుల్ గాంధీ పని చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటి వాటాను తన గురువు చంద్రబాబుకు సిఎం రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుంటే రాహుల్ మౌనంగా ఉండటం కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని కెటిఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్ (ఐటిఐఆర్)ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారని విమర్శించారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలోనూ రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదని చెప్పారు. బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్ సభలో మాట్లాడలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

అభివృద్ధి లేదు.. పథకాలు అందవు

- అక్రమ కేసులతో బిఆర్ఎస్ నాయకుల్ని భయపెట్టేయత్నం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేదు.. పథకాలు సరిగా అందడక ప్రజలు హరిగోస పడుతున్నారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చండూరు పట్టణ కేంద్రంలో మున్సిపల్ అధికారులు కూల్చేసిన మాజీ ఎంపిపి తోకల వెంకన్న భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో పేదలు బతకలేని పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికిప్పుడు ఎలక్షన్స్ పెడితే వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొత్తగా నిధులు తెచ్చి ఎక్కడా రోడ్డు వేసిన దాఖలాలు లేవన్నారు. వ్యవసాయరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా వస్తున్నాయని, రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కొంత మంది ప్రజాప్రతినిధులు పోలీసుల నుంచి మామూళ్లు తీసుకోవడం దురదృష్టకరమని, ఉద్యోగుల బదిలీలకు కూడా డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కు నీటిపారుదల, సివిల్ సప్లై శాఖలపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కృష్ణా నీటితోపాటు గోదావరి జలాలను కూడా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం, మంత్రులు అభివృద్ధి పనులు వదిలేసి కెసిఆర్‌ను తిట్టడంలోనే పోటీ పడుతున్నారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో బిఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతున్నారని, ఇలాంటి కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సమస్యలపై ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. చండూరులో జరుగుతున్న పనులన్నీ బిఆర్ఎస్ సర్కార్ ఇచ్చినవేనన్నారు. కానీ, కమీషన్స్ కోసం కాంగ్రెస్ నేతలు బిల్లులు ఆపుతున్నారని ఆరోపించారు.

రైతులను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు

- ఓట్ల కోసమేనా రైతుల పక్షాన పోరాడింది?
- తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ కన్నెగంటి రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తోందని, ఓట్ల కోసమే రైతుల పక్షాన నటించి గద్దెనెక్కిందని తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ కన్నెగంటి రవి, మానవ హక్కుల వేదిక విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు, హైకోర్టు అడ్వకేట్ శ్రీకాంత్ అన్నారు. ఫార్మా భూముల విషయంలో హైకోర్టు ఆర్డర్‌ను గౌరవించాలని కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని ఫార్మాసిటీ బాధిత గ్రామాలైన కుర్మిద్ద నుంచి ప్రారంభమైన రైతుల పాదయాత్ర తాడిపర్తి, నానక్‌నగర్ గుండా మేడిపల్లి వరకు కొనసాగింది. తమకు న్యాయం చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులు నినాదాలు చేశారు. డప్పు-చప్పుళ్లు, నినాదాల మధ్య పాదయాత్ర సాగింది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ 'జై బాపు.. జై బీమ్..' అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైకోర్టులో రైతుల పక్షాన ఆర్డర్ వచ్చినా ప్రభుత్వం అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఫార్మా నోటిఫికేషన్, భూములకు ప్రకటించిన అవార్డ్‌ను హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. రైతులకు న్యాయం చేకూరేలా కోర్టు తీర్పును వెలువరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందన్నారు. ఇక్కడి పచ్చటి పంట పొలాలను కంపెనీల పేరుతో విషతుల్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రైతుల ఉపాధిని దెబ్బతీసే కుట్రకు ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆర్డర్‌ను గౌరవిస్తూ ఫార్మా బాధిత రైతుల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ సర్వ హక్కులు కల్పించి, వారి భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు వంటి పథకాలు రైతులందరికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బందే రాజశేఖర్‌రెడ్డి, దంతుక పెద్దయ్య, దోస రమేష్, ఫార్మాసిటీ వ్యతిరేక కమిటీ సభ్యులు కవుల సరస్వతి, కుందారపు నారాయణ, కానమోని గణేష్, మైపాల్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, అనసూయమ్మ, శ్రీకాంత్‌నాయక్, జక్కుల వెంకటేష్, నాలుగు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులందరూ 9న పనిచేయొద్దు

- ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలి
- తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక చట్టాలను సంరక్షించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను భవన నిర్మాణ కార్మికులు జయప్రదం చేయాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆ రోజు పనులు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం 1996, అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979, కాంట్రాక్టు కార్మికుల చట్టం-1970లతో పాటు ఇతర కార్మిక చట్టాల రక్షణ కోసం కొట్లాడాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, టియుసిఐ, ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు, బిఎన్‌ఆర్‌కెఎస్, స్ఫూర్తి, ఐఎఫ్‌టియు యూనియన్లకు భవన నిర్మాణ కార్మికుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అందులో వంగూరు రాములు, ఆర్ కోటంరాజు, ఎ రాజు, కె జంగయ్య (సిఐటియు), ప్రవీణ్‌కుమార్, రమేశ్ (ఎఐటియుసి), అనురాధ (ఐఎఫ్‌టియు), విజయ్, సరళ (ఐఎఫ్‌టియు), నారాయణ (బిఆర్‌టియు), కామెళ్ల ఐలన్న (బిఎన్‌ఆర్‌కెఎస్), కుమార్, చంద్రమౌళి (స్ఫూర్తి) తదితరులు మాట్లాడారు. నాలుగు, ఐదు తేదీల్లో సైకిల్ ర్యాలీలు చేయాలని, ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో పనిప్రదేశాల్లో విస్తృత ప్రచారాలు చేయాలని పిలుపునిచ్చారు. 9న జరిగే సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్కు వరకు జరిగే ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకురాబోయే నాలుగు లేబర్ కోడ్‌లు అత్యంత ప్రమాదకరమైనవని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించాలనీ, బోర్డులోని నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అన్నిరకాల నిర్మాణాల పనుల వద్ద ప్రమాదాలలో గాయపడి, మరణించినా నష్టపరిహారాలు అందుతున్నాయని, లేబర్ కోడ్‌లు అమలైతే 12 అడుగుల ఎత్తు లోపు నిర్మాణాల వద్ద, భవనాల్లో రిపేర్లు, మార్పులు, చేర్పుల పనులకు, చమురు, గ్యాస్ సంస్థల నిర్మాణాల్లో పనిచేసే కార్మికులకు ఈ చట్టం వర్తించదని వివరించారు. సెస్ నిధుల వసూళ్ళలో మార్పులు చేస్తూ యజమాని చెప్పిన విధంగానే వసూలు చేయాలనీ, సెస్సు వసూలు రూ.పది లక్షల నుండి రూ.50 లక్షల పైబడిన నిర్మాణాల నుండే వసూలు చేయాలని కోడ్‌లలో పొందుపర్చారని తెలిపారు. పది మందికి పైన పనిచేసే చోట మాత్రమే కార్మికుడు చనిపోతే చట్టం వర్తించేలా కోడ్‌లో పొందుపర్చారని వివరించారు. నిర్మాణాల్లో వాడే ముడి సరుకుల ధరలు పెరిగి సామాన్యుల ఇండ్ల నిర్మాణాలు తగ్గిపోయాయని, ఫలితంగా కార్మికులు చేతినిండా పని దొరక్క అడ్డాల వద్ద పనుల కోసం ఎదురుచూస్తున్న స్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డు నుంచి కార్మికులకు ఇవ్వవలసిన నష్టపరిహారాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదనీ, బోర్డులో పైరవీకారులు, బ్రోకర్ల ప్రభావాన్ని అరికట్టాలని కోరారు. వెల్ఫేర్ బోర్డుకు రూ.ఆరు వేల కోట్ల సెస్ వసూలైతే కార్మికులకు ఇచ్చింది రూ.1500 కోట్లు మాత్రమేననీ, మిగతావి ఇతర పథకాలకు మళ్లించారని విమర్శించారు.